
14/4/91

# టెర్లిన్ చీర

— సీత



టాంక్‌బండ్ మొదట్లోనే ఉన్న ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పక్కగా ఉందాపార్కు.

చాలా సేపట్నించి నిలబడి ఉందక్కడ వనజ.

చిట్టిబ్బాయి ఇందాక అన్నమాటలే మనసును పట్టి పీడిస్తున్నాయి.

"ఇప్పటికి నూటా ఇరవై రూపాయలయింది. ఇచ్చి పట్టికెళ్లు చీర" నిక్కచ్చిగా చెప్పేశాడు.

"సరే...నూట ఇరవై కదా... ఇచ్చేస్తాన్లే. ఆ లైట్ బ్లూకలర్ చీర తియ్యి చెప్తా" అంది తను వేలితో చూపిస్తూ.

మామూలుగా కాదు కూడదని పెద్ద పట్టుబట్టాడు చిట్టిబ్బాయి.

కానీ, ఆ వేళెందుకో తిక్కమీదున్నాడు.

"చెబుతున్నా కదా! పాతబాకీ ఇచ్చాకే మళ్లీ చీరిచ్చేది"

"ఏంటమ్మా అంత పంతం— ఇచ్చేస్తానంటున కదా".

"కుదర్దు"

మనసెందుకో చివుక్కుమంది. కాసేపే అది. మళ్లీ మామూలుగా అయిపోయింది వనజ!

"మంచోడివి కదూ, ఈ ఒక్కసారికి" జార్చాలని జార్చలేదు తను, మామూలుగానే జారింది పైట.

ఎంతమంది చేతులు పడి నలిగినా, పుష్టిగా ఉంటాయి తన గుండెలు.

చూడక ఛస్తాడా.

గుటకలు మింగాడు చిట్టిబ్బాయి. తనకి జివ తక్కువ చెమ ఎక్కువ.

"పోనీ 'ఆలా' చెల్లేసుకోకూడదో" బల్లమీద మోచేయి ఆన్చి వొంగుంటూ అంది.

మనసెంత పీకుతున్నా చెల్లేసుకోడమనే మాట చేదుగా అన్పించింది చిట్టిబ్బాయికి.

"ఏంవద్దు కానీ రెండు మూడు విడతల్లో కట్టెయ్. బకాయిలు పెట్టద్దింక" కాస్త దారికివచ్చేడు చిట్టిబ్బాయి.

"అలాగే".

"ఏ చీర అడిగావు ఇందాకా".

"ఆ వైట్ బ్లూకలర్ చీర".

తీశాడు చిట్టిబ్బాయి.

"కాస్ట్లీ చీర ఇది. జాగ్రత్తగా తీసుకొచ్చి ఇవ్వాలి ముందే చెబుతున్నా" చీర మడత పెట్టి ఇస్తూ చెప్పేడు.

"అట్నే".

కుచ్చెళ్లు ఓమాటు సర్దుకుని ఆ కుర్రాణ్ణి చూసి ముచ్చటగా నవ్వింది వనజ.

ఆగిపోయాడు కుర్రాడు. వాడు కుర్రాడేమిటి, ముదరమొహమే.

గుర్తుపట్టేశాడేమో తన సంగతి, "ఎంత?" అనడిగేశాడు.

"జేబులో ఎంతుంది?" ఆటో చూస్తూ అంది వనజ.

జేబులు తడుముకున్నాడు. "అలాకాదు, చెప్పు నీ రేటెంతో".

"..." చెప్పింది తను.

"ఎక్కువ చెబుతున్నావు. అందులో సగానికైతే నేను ఓకే"

"ఆటో పిలు" అంది వనజ ఒక నిర్ణయానికి వచ్చేసి.

ఆటోలో వాటేసుకు పోయినట్టు కూచుని ఒళ్లంతా తడిమేస్తున్నాడు వాడు.

ముందు అద్దంలోంచి ఆటో అబ్బాయి అంతా చూస్తూనే ఉన్నాడని తనకి తెలుసు.

"ఏయ్, ఏమిటో ఆత్రం? సరిగ్గా కూచో"

ఊహూ.. తను వింటేనా, చూస్తేనే తెలుస్తోంది కొత్తయితే కాదని, బాగా నలిగిన వాడే. కాకపోతే ఆ సుఖానికి చాలా రోజులుగా దూరమయి ఉన్నాడేమో.

పొట్టమీద వాడి చేతివేళ్లు తమకంగా కదులుతున్నాయి.

ఆ చెయ్యి అలా పైపైకి వచ్చి....

"చెప్తుంటే నీక్కాదు?" దూరంగా జరిగింది తను.

జుట్టువేళ్లతో వెనక్కి దువ్వుకుని చేతులు వొళ్లో పెట్టుకుని కూచున్నాడు. అంతలో ఆటో షార్ప్‌గా టర్న్ తీసుకోవడంలో తనే వెళ్లి వాడిమీద పడింది.

ఆ అవకాశాన్ని వృధా పోనియ్యలేదు వాడు.

ఇల్లొచ్చేసింది.

'తను తాళం తీస్తుంటే వాడు ఆటోకి డబ్బులిచ్చేసి లోపలికొచ్చాడు.'

లోపలికొస్తూనే గట్టిగా వాటేసేసుకున్నాడు.

"అయ్యో... కొంచెం ఉండు. మంచినీళ్లు తాగనీ"

కూజా పైకెత్తేసి గడగడా తాగింది నీళ్లు.

వెనక్కి తిరిగిచూస్తే తనప్పుడే షర్ట్ తీసేసి పాంటు బెల్టు లాక్కుంటున్నాడు.

చాపపరిచి దుప్పటి దులుపుతుంటే పైటకొంగు పట్టుకులాగేడు—

"నేనే తీసేస్తానుండు" అంది తను.

వింటేనా— చీరలిప్పడంలోని థ్రిల్‌ని ఫీలవుతూ పరపరా లాగాడు.

చీరంచు వనజకాలుకింద ఉందేమో ఆ లాగుడికి సర్రుమన చిరిగిపోయింది.

గుండె పగిలినంత పనయింది వనజకు. కళ్లల్లో నీళ్లు గిర్రున తిరిగాయి.

చీర చినిగిపోయిందంటే చిట్టిబ్బాయి చంపేశాడన్న మాటే. ముందే జాగ్రత్తలన్నీ చెప్పిచ్చాడు. కాస్తోకూస్తో అయితే ఏదో చెప్పొచ్చు. కాని ఇంత పేరు చిరిగిపోయింది చీర. మొత్తం ధర నిలబెట్టి వసూలు చేస్తాడు చిట్టిబ్బాయి. కాని తను ఎక్కణ్నుంచి తెచ్చి కడుతుంది. తప్పదు, పెద్దయాగీ చేస్తాడు బజార్లో.

ఏడుపు తన్నుకొస్తోంది వనజకి.

తన పనయిపోయిందేమో వాడు చాలా మామూలుగా లేచిపోయి బట్టలు వేసుకున్నాడు. వనజకి చెంపలు తడిసిపోయాయి.

చెయ్యిజాపి ఆ చిరుగుచీర పైన కప్పుకొని తడి కళ్లతో నిస్తేజంగా చూస్తూ ఉండిపోయింది.

"డబ్బులు ఆ పౌడరు డబ్బాకింద పెట్టాను" చెప్పేసి వెళ్లిపోయాడు.

వనజ అటు చూడనుకూడా చూడలేదు.. వెక్కివెక్కి ఏడుస్తూనే ఉంది..

○